జవరాలి చిత్తం

మరే... అంతా నా చెప్పుచేతల్లోనే వుంటున్నారమ్మా...” బుంగమూతి పెట్టి అటుతిరిగి కూర్చుంది రాజ్యలక్ష్మి.

“లేదేమిటి?... దేవిగారు అడుగులో వుండమంటే అరడుగులో వుంటున్నాడీ దాసుడు.. ఒక్క అయిదు నిమిషాలాలస్యమయింది. అంతేగా?.. ఏదీ?అరె! చూడు నీ చేతులెలా కందిపోయాయో..” తన రెండుచేతుల్లోకీ ఆ పిల్ల మృదుహస్తాలను తీసుకుని మూర్కొన్నాడు కృష్ణ. “అసలే ఆ బల్ల గేదెపెయ్య లాంటిది. ఒక్కర్తివీ దాన్నెందుకు అట్నుంచి యిటు వేయడం చెప్పు? నువ్వు చాకిరీచేయడం నా కిష్టం వుండదు'- నిజంగా భార్య పడ్డ శ్రమకి నొచ్చుకున్నాడు.

రాజ్యలక్ష్మి “పోదురూ” అని చేతులు జాగర్తగా లాగేసుకుని, సిగ్గుతో ఆ దోసిట్లోనే మొహం దాచుకుంది.

“ఇక్కడెవరూ లేరు కదా! ఎందుకో అంతసిగ్గు” అన్నాడు లేచి. ఆ ఆఫీసుగుడ్డలు మార్చుకుని, మొహం కడుక్కుని రండి,” అంటూ వంటయింటి వైపుకి వెళ్లిపోతున్న రాజ్యలక్ష్మిని తన్మయంగా చూశాడు.

కృష్ణ గదికి పాతరూపు లేనే లేదు! బల్ల అట్నుంచి యిటు మారిపోయింది. కిటికీకి మట్టి కొట్టుకున్న తెరలేదు. రంగు రంగుల కొత్త తెర కళకళలాడుతోంది. బల్లమీద ఏనాటిదో ప్లాస్టిక్ గుడ్డ తీసి అవతల పారేసి దానిస్థానే స్వహస్తాలతో అల్లిన అల్లికగుడ్డ పరిచింది రాజ్యలక్ష్మి. గోడలమీద సాలెపురుగులకు, బల్లులకు గల జన్మహక్కును రాజ్యలక్ష్మి ఒప్పుకోలేదు. కొత్త వెల్తురు వచ్చినట్లుంది గదిలోకి. “పుస్తకాల ర్యాకు”లో పుస్తకాలన్నీ బుద్ధిగా వున్నాయి!

“ఇటింకె, యిల్లాలు దీపం” అన్నారు అనుకున్నాడు కృష్ణ. అంతలో రాజ్యలక్ష్మి టిఫిను, కప్పుతో కాఫీ పట్టుకొని వెలిగించిన దీపంలా నవ్వుతూ వచ్చింది. “థాంక్యూ” అని అందుకోబోయాడు.

“నో మెన్షన్‌సార్.” టిఫిన్ ప్లేటు వెనక్కి తీసుకుంది. “మొదట ఆ దిక్కు మాలిన దుమ్ముగుడ్డలు

తీసి అవతల పారేయండి."

కృష్ణ మాట్లాడకుండా అవతలికి వెళ్లి బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని వచ్చాడు.

"చిత్తం" అన్నాడు. అతగాడికి తెలుసు. భార్యతో టిఫిను కాఫీకి కూడా మడికట్టుకోవాలా ఏం! అని వాదిస్తే ప్రయోజనం వుండదని.

"చూసుకుని మరీ తాగండి.వేడి ఎక్కువగా వుంటే ఆనక నన్ను అనొద్దు."

కృష్ణ కాఫీ తాగుతూ వుంటే రాజ్యలక్ష్మి ఆల్చిప్పలంతేసి కళ్ళు చేసుకుని వింతగా గమనిస్తోంది.

కిటికీ తెరలను దూసుకుని గాలి వీచి అతని ముంగురులు పాలభాగంమీద అడుకుంటున్నాయి. అవి గీస్తున్న కార్టూన్ బొమ్మలను చూడడానికా అన్నట్లు ఆ పిల్ల అదే దీక్షగా చూస్తోంది.

పొలక మారింది కృష్ణకి. మరే మౌతుంది? చూపులు సుదతిమీద! ధ్యాస ఎక్కడో ఊహాలోకంలో.

"ఆఁ... వచ్చిందీ... పొడిదగ్గుకూడా. ఏ హోటల్లోనో వెధవ చమురు సరుకు ఏదో తినివుంటారు..." కప్పునందుకుని తనచేత్తో అతని రొమ్ము రుద్దింది.

"లేదు రాజ్యం... నువ్వొద్దన్నావుగ!" ఎట్టకేలకు దగ్గు సర్దుకున్నాక అన్నాడు.

కృష్ణకి నిజంగా భయం. మధ్యాహ్నం రామారావు బలవంతం చేశాడు. బజ్జీలు తినిపించాడు. కానీ రాజ్యం వచ్చిం తర్వాత హోటల్లో తినకూడదనే ఆంక్ష విధించింది గనుక కృష్ణ ఆ వూసెత్తడు. అసలు రాజ్యం వద్దు అన్న పనిచేయడం కృష్ణకి చాతకాదు. ఆ మాటే రామారావుతో అంటే పక్కున నవ్వేశాడు వాడు. "ఓరి నీ....మూడేళ్ళు అడ్డమైన చిరుతిళ్ళమీద బ్రతికి యివాళ ఆవునెయ్యి, మరుగునీళ్ళు త్రాగాలంటావేమిటిరా?" అన్నాడు.

వస్తూనే నడుమునున్న పటకా ఐనా వూడదీసుకోకుండా మంచంమీద కూలబడే కృష్ణ బుద్ధిగా మొహమూ, కాళ్ళూ కడుక్కుని వచ్చి పీటమీద కూచుని టిఫిను తింటున్నాడు.

"చూడు రాజ్యం!... నువ్వు నన్ను పూర్తిగా మార్చేశావ్..." వెళ్ళిపోతూ వుంటే కొంగుపట్టుకు లాగి నడుంచుట్టూ చెయ్యివేసి, ఒడుపుగా దగ్గిరికి లాక్కుని, తాను ఉక్కిరిబిక్కిరై ఆ పిల్లని ఉక్కిరి బిక్కిరిచేసి మరీ ఒప్పుకున్నాడు కృష్ణ.

"అదుగో.. అదే వద్దు... అవతల మీ సినిమాకి వేళైపోతోంది." చిలిపి చేష్టలు చేస్తే "హన్నా" అని చంటి పిల్లాణ్ణి వారించినట్లు చూసి, విడిపించుకుని మెరుపుతీగెలా దూసుకుపోయింది.

"ఎంత అదృష్టం" అనుకున్నాడు తనని తాను అభినందించుకున్న కృష్ణ.

కాని "యీ డిసిప్లిన్ గొప్పయిదిగా వుంది" అని గొణుక్కున్నాడు.

"చూడు రాజూ! యీ యాష్‌కలర్ షర్ట్ వేసుకోనా?" తన బట్టలన్నీ అమర్చి వున్నచిలక్కొయ్య దగ్గరికెళ్ళి కేక వేశాడు.

"అయ్యో!..." ఇంత అమాయకత్వమేమిటి బాబూ అన్నట్లుందా కంఠధ్వని.

"కర్మ! అవతల ముసురుపట్టినట్లుంది. ఎందుకొచ్చిన యాష్‌రంగు... నీలం వుంది ముదురురంగు, వేసుకోండి నాకిష్టం.' రాజ్యం మాటే కృష్ణబాట. వేరే యిష్టం లేదు కృష్ణకి - అసలు యింతకుముందు ముదురు నీలం అంటే వొళ్ళు మండించుకునేవాడు. వెంటనే అదే తొడుక్కున్నాడు.

నీటుగా, నీలంరంగు ఎర్రంచు చీర కట్టుకుని, ఎర్రపూలజాకెట్ తొడుక్కుని, గంభీర సంధ్యాసుందరిలా వచ్చిన రాజ్యలక్ష్మికేసి తిరిగి, 'ఓ కే' అన్నాడు వేషం పూర్తిచేసుకుని కృష్ణ.

రాజ్యలక్ష్మి దగ్గరిగా వచ్చి...."ఆ స్లాకు వేసుకోలేకపోయారా?... నేనే వుతికి యిస్త్రీ చేశాను చొక్కాకి ధోబీ గంజి ఎక్కువ పెట్టేశాడు. కంపువేయడం లేదూ?" కాలరు సర్దుతూ అడిగింది.

ఏమో?... కృష్ణ కేం తెలుసు.. ఎప్పుడూ, గంజిబట్టలే.. ఎప్పుడూ హోటలు తిండే. ఎప్పుడూ యాష్‌కలర్ ప్యాంటూ, గుర్రంబుర్ర మార్కు టై ఎప్పుడూ ఒకేమార్కు హేరాయిలు! మంచిదని ఎడ్వరుటయిజుమెంటులో తనకు నచ్చిన తార చెప్పిన సబ్బు అంతే....

"సరే! ఏమో మరి... యిప్పుడిప్పుకో మంటావా మరి? టై కూడా బిగించేసుకున్నా." తప్పుచేసిన బడిపిల్లాడిలా నుంచున్నాడు.

"పోన్లెండి" సానుభూతిగా నవ్వేసింది. ఇవాళ్టికి క్షమించాం. ఆ తుంబురుడి మార్కు టై అవతల పారేసి రండి నాతో"

వెంటనే టై యిప్పేశాడు.

అసలొక పిక్‌నిక్‌లో సహాధ్యాయిని, కాలేజీ బ్యూటీ అనిపించుకున్న కాత్యాయిని బాగుందన్నప్పట్నుంచీ తను యీ గుర్రంబొమ్మ వున్న ఎర్ర టై వాడుతున్నాడు. కాని రాజ్యం మాటకి తిరుగులేదు. అసలివాళే కాదు.. పెళ్ళి చూపులకు ముందే తొలిసారి రాజ్యలక్ష్మిని తాను చూసినప్పుడే, ఆ పిల్లకి కృష్ణ మనసుకు పూర్తిగా వశమై పోయింది. తమాషా ఏమిటీ అంటే పెళ్ళిచూపులకు తను "గుర్రం టై, యాష్కలర్ ప్యాంటూ, వైట్‌షర్టూ" వేసుకుని వెళ్లాడు. అప్పుడు నల్లరంగు 'షూ' వుండేది కూడా. దరిమిలా రాజ్యలక్ష్మి ఎర్రంగు జోళ్లు కొనిపించింది.

"'పగటి నక్షత్రాలు' సినిమాకేగా మన ప్రయాణం?"

అందులో తనకాలేజీరోజుల నాటి అభిమాన తార 'ఆరాధన' వుంది. అందుకే అడిగాడు ఆశగా.

"ఛీ! పోనిద్దురూ?... 'కొత్త ఘడియలు' చూద్దాం" అనేసింది రాజ్యలక్ష్మి.

కృష్ణకి రాజ్యలక్ష్మిని కాదనగల శక్తిలేదు. రాజ్యలక్ష్మికి, కృష్ణ యిష్టానిష్టాలు తనకు తెలుసుననె గర్వముంది. చాలాసార్లు "అమ్మకు వున్న గుణాలు కొన్నినీకు వున్నాయి," అనేవాడు కృష్ణ.

రాజ్యలక్ష్మి భర్తచేసిన ఆ అభినందనకి మురిసిపోయేదేం కాదు గాని-"నాకు తెల్సు. మీరు అమాయకులని ఆవిడా గ్రహించివుంటారు..." అనేది ఆ పిల్ల! బంగాళాదుంపలను వుడికించి,

వేపడంగాచేసి 'మీకు యిష్టమని చేశాను" అనేది. మూణ్ణెల్ల కాపురంలో ఆ పిల్లకు అదెలా తెలుసో కృష్ణ అడగలేదు. అమ్మకూడా యిలాగే అనేది. తనకు వెల్లుల్లిపాయలు యిష్టంలేదు. హొస్టలులో, హోటలులో, మరెక్కడా తినడు కాని అమ్మ మాత్రం, "నాకు తెలుసు... నీకు యిష్టమే... చిన్నప్పుడు మీ నాన్నగారు తినరని ఆయనకు వేరే చేసి, నీకు ఈ వెల్లుల్లిపాయలు దండిగా పోసి చేసేదాన్ని" అనేది. తినేవాడు కృష్ణ. ఇప్పుడు రాజ్యలక్ష్మి అంతే!

"ఇంచక్కా రాయ్‌గార్డెన్స్‌లో ఏర్ కండిషన్డు రూంలో భోంచేసిపోదాం," అన్నాడు సినిమా అవగానే.

సినిమా ఏం బాగోలేదు. తన స్నేహితుడెవరైనా తీసుకువెళ్తే, వెనకటి రోజుల్లో తలనొప్పి మాత్రలు కొనియిమ్మని అల్లరిచేసేవాడు. కాని రాజ్యం! రాజ్యంతో అంత మాట అనడమే!! భేషుగ్గా వుంది అనకపోయినా, ఆ పిల్ల చెప్పినదానికి "వూఁ" కొడితేచాలు. భర్త సరదా గుర్తించని పిల్లకాదు రాజ్యలక్ష్మి. ఎయిర్‌కండిషన్డ్ గదిలో భోజనం చేయలేని అనాగరికురాలు అంత కన్నా కాదు. కాని యింటి దగ్గిర ఆయనికి యిష్టమని కష్టపడి పుస్తకాల్లోని ఆడశీర్షికలు వెతికి వెతికి 'పాలోళీ' తయారుచేసింది. అందుకనే "వూహూఁ" అంది.

ఏడుపు మొహం పెట్టాడు పాతికేళ్ళ కృష్ణ. పద్దెనిమిదేళ్ళ రాజ్యలక్ష్మి చంటి పిల్లాడి గెడ్డంలా, అతని గెడ్డం పుచ్చుకుని, "ఛా, కోపమా... రేపెల్లాంగా.. సరేనా" అంది. కరిగిపోయాడు. "నీ యిష్టం,' ' అన్నాడు.

"కాదు పాలోళీ మీకే యిష్టం" అన్నది రాజ్యలక్ష్మి.

రిక్షాలోనుంచి రాయ్‌గార్డెన్స్ రంగు దీపాలు ఆశగా చూసి, పోనీలే అనుకున్నాడు కృష్ణ, రాజ్యాన్ని దగ్గరగా తీసుకుని తన్మయత్వం చెందుతూ.

2

మర్నాడు యింటికి వచ్చేసరికి రాజ్యలక్ష్మి యింటిముందు కాంపౌండులో చిన్న చిన్న మొక్కలు నాటుతున్నది. అరగంటకు ముందుగా ఎలాగో బయట పడి, దోవలో పూలబజారుకు వెళ్ళి కావలసినన్ని పూలు కొనుక్కొచ్చాడు కూడాను. రాజ్యలక్ష్మి నుదుట చెమట పోసింది. ముంగురులు ఫాలభాగాన కరుచుకుపోయాయి. కుంకుమ ముక్కు మీదికి కారిపోయింది. గుమ్మడిగింజలాంటి ఆ ముక్కుకొసని మట్టి పులుముకుంది. ఎండలో వాడిన తమలపాకులా వుంది ఆ పిల్ల!

గొప్ప కష్టమనిపించింది కృష్ణకు. "ఛ! ఎండలో, మన్నులో యేఁవిటా సరదా? పూలమొక్కలు వేసి, అవి పూసి, అనక, నే కోసి యివన్నీ చాలా రోజులు... పడుతుంది. అందుకేగా చూడు..." వులిక్కిపడి వెనుదిరిగి చూసింది రాజ్యలక్ష్మి. పూలపొట్లం అందించాడు కృష్ణ. రాజ్యలక్ష్మి మొహంలో ఎరుపు తగ్గిపోయింది.

"మారాజులు మీకేం?... పూలు బజార్లో కొంటారు. భోజనం హోటల్లో చేస్తారు. కాని నాకు పూలమొక్కలు అంటే సరదా..." ఆ ప్రక్కనే వున్ననీళ్ళకుండీలోనించి నీళ్లు తీసి మొక్కని పసిపిల్లాడిలా సున్నితంగా పట్టుకుని తడిపింది లక్ష్మి.

"సారీ! అదికాదు నా ఉద్దేశం... నువ్వు..." అక్కడే చతికిలబడ్డాడు, పూలమొక్కలంటే బొత్తిగా యిష్టంలేని కృష్ణ.

"మూణ్ణెల్లు టైమివ్వండి. మీ బజారు పూలకి చక్రవడ్డీతో సహా బదలాయించేస్తాను" విరిసిన పూలమొక్కలా నవ్వేసింది రాజ్యలక్ష్మి.

"నే ననుకోలేదు... పూలమొక్కలంటే నీ కింత యిష్టమని... రేపు నర్సరీ పార్కు కెళ్ళి మొక్కలు కొనుక్కుందామా!"

"ముందిక్కణ్ణించి లేద్దాం." భర్త మాటకి పూర్తి ఆమోదాన్ని చూపించి లేచింది రాజ్యలక్ష్మి.

"ఇవాళ నీదే వంతు.. ముందా 'మన్ను' చేతులు కడుక్కొని ఆనక టిఫిను తే" ఆ మట్టిచేతులే వోసారి పుచ్చుకుని మొహం దాచుకోబోయి ఆ పిల్ల కళ్ళెర్రజేసి వారించగా మానేశాడు.

"గొప్పే" అంటూ లోపలికి తుర్రుమంది రాజ్యలక్ష్మి.

"బాబోయ్? యిదేంటిది? స్వీటు! నాకొద్దు."

నిజంగానే ఆ స్వీటు యిష్టంలేదు కృష్ణకి. కోపం వచ్చేసింది రాజ్యలక్ష్మికి.

జిలేబీలు చేయించడానికి ఉదయం నుంచీ వెళ్ళి పక్కింట్లో నున్న తులసక్కయ్యగార్ని ప్రాధేయపడి తీసుకువచ్చి, ఆవిడ సాయంతో చేసినందుకు మారుగా, భర్త సయించవంటే మరేమొస్తుంది? ఆ పిల్ల ముక్కు, దాని మీదున్న గుమ్మడిగింజా యివే ముందు కందిపోతాయి.

"అదిల్లా యివ్వండి... అవతల పారేస్తా"

ఇంకా ఎక్కడుంది యివ్వడానికి. అప్పటికప్పుడే గొంతులో కుక్కేసుకుని నీళ్లు తాగేస్తున్నాడుకృష్ణ. డోకు వచ్చేస్తోంది కూడా. కాని రుచి అనుభవిస్తున్నట్లు నటిస్తున్నాడు.

కోపం మాయమై పోయింది రాజ్యలక్ష్మికి. భర్త దగ్గరగా వెళ్లి రొమ్మురుద్దీ, అతని తలను గుండెల్లో దాచుకుని, "మరి తినఖర్లేదులే.. నాకేం తెలుసమ్మా! మీకు జిలేబీలు యిష్టం లేదనీ" అన్నది. రెండో చేత్తో ప్లేటు ఎడంగా నెట్టేసి అతని తలమీద ముద్దు పెట్టుకుంది.

వూపిరి పీల్చుకుని 'అలవాటై పోతాయిలే అవే రెండుసార్లు తింటే' అన్నాడు కృష్ణ మరింత దగ్గరగా తన తల నామె గుండెల మధ్య హత్తుకుంటూ.

"ఉహూఁ! పకోడీలు తినండి చాలు" జిలేబీలు అవతలికి తీసేసుకుంది.

పకోడీలు 'మాంఛి' బాగున్నాయి. కృష్ణకి యిష్టం కూడాను. అందుకనే మరో ధ్యాసే లేదు.

"పోనీ! మరేం! ఏవండీ..." తన్మయత్వంగా టిఫిను తింటున్న కృష్ణ రాజ్యలక్ష్మి యేదో అడగటానికి సంకోచపడుతోందనుకున్నాడు.

"ఊం! ఊం! దేవిగారు చెప్పండి.పకోడీలు ఫస్టాసు అనుకో" అన్నాడు.

"ఇవాళే పనిలో పని పూలపార్కుకి పోయి ఓ డజను మొక్కలు కొనేసుకుంటే..." నేలని బొటనవేలు రాసింది.

పూలచెట్లంటే అంత మమకారం లేదుగా కృష్ణకి. మింగడం అమిత కష్టమైనట్లు ఓ పకోడీ ముక్క మింగి "వెళ్దామంటావా?" అన్నాడు.

"ఉహూం!... మీ యిష్టం. నిన్న మీరే అన్నారుగా..." వంటగదిలోకి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

వేరే యిష్టమెక్కడ? కృష్ణకి.

"నేను రెడీసార్" - కేక వేశాడు.

"ఇదో వచ్చా... - " రాజ్యలక్ష్మి హుషారుగా నడిచింది. దాంతో పాంజువలు, మట్టెలూ ఆ పిల్ల ఎదపులకింతనూ, ఆనందాన్నీ ప్రకటించాయి!

కృష్ణ కేం తెల్సు? ఏ మొక్కల్ని ఎలా పెంచాలో... అన్నీ రాజ్యలక్ష్మి వోపిగ్గా నర్సరీ పార్కు 'మాలీ" కనుక్కుంటూవుంటే, ప్రక్కనే రోడ్డు మీద వెళ్తూ, వస్తూవున్న వాళ్ళను చూస్తూ నుంచున్నాడు.

"మరేమో... మీకు యీ పూల మొక్కలూ అవీ అంత నచ్చవుకదూ!" తిరుగుదలలో అడిగింది రాజ్యలక్ష్మి.

"ఇంకా నయం! ఎంతో యిన్‌సల్ట్! రాజ్యలక్ష్మి ప్రియుణ్ణి కదా? నాకు పూలంటే యిష్టంలేదా చెప్పు! నువ్వు 'వూం' అంటే చాలు - ఆ మొక్కల్ని అమాంతం తినేస్తాను"-ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు.

"సరేకానీ, నేనో స్వెటర్... దేవిగారి శెలవైతే..." ఫ్యాన్సీ షాపుముందు ఆగాడు.

"బాగానే వుంది వరస... అంతా నా ఆజ్ఞేనా? నిండుగర్వంతో, బుగ్గలు కెంపెక్కగా చూసి కనులు వాల్చుకుంది.

మెట్లెక్కుతున్న భర్తను ఎడంచేత్తో సున్నితంగా తాకి అదికాదండి మా వారికి స్వెటర్ నేనే అల్లియిస్తానుట.... వూలు రెండు పౌన్లు తీసుకుందాము....." చెప్పింది రహస్యంగా.

ఏమంటాడు? మనసులో 'చిత్తం' అనుకున్నాడు.

3

"సరిపోయింది... ఏం పిల్లాడమ్మా! స్వెటర్ తొడుక్కోడమేనా రాదూ..." చేతులు పులిసిపోయేలా

ఏకాగ్రంగా కూచుని, స్వయంగా తను అల్లిన స్వెటర్‌ను తిరగేసి తొడుక్కున్న భర్తను చూసి వుత్తిత్తి కోపం ప్రదర్శించి, మురిసిపోయింది రాజ్యలక్ష్మి.

'మరెలాగ'? అన్నాడు పసిపిల్లాడి మొహం పెట్టి భర్త! మాతృవాత్సల్యం పొంగారస్వెటర్ సరిగ్గా తొడిగింది రాజ్యలక్ష్మి. "ఏదీ చూద్దాం కాస్త దూరంగా వెళ్ళి నుంచోండి" అంది కుతూహలంతో.

"అయ్యో కాస్తపొట్టి అయిందల్లే వుందే. మరి రెండవున్నులుంటే పోయేదా? ఎన్నిసార్లు చెప్పానో... వూలు మాటే జ్ఞాపకంలేదు మీకు పూలగోల తప్ప..."

ఓసారి మురిసిపోయింది. ఓసారి అక్కడ పొట్టి అని, యిక్కడ మెలికపడిందనీ నొచ్చుకుంది. అటుతిరగమని, యిటు తిరగమని కృష్ణను ఆటబొమ్మను తిప్పినట్లు తిప్పి చూసుకుంది.

గర్వపడ్డది. "ఇంచక్కా రాజులాగా వున్నారు" అన్నది.

'అవును మరి, నా రాజ్యలక్ష్మి ధర్మమా అని రాజునేగా మరి-" దగ్గరికి లాక్కున్నాడు.

"అబ్బో బడాయి" అతని గుండెల్లో తలదాచుకుంది.

కృష్ణని రాజ్యలక్ష్మి పూర్తిగా మార్చేసింది. పోయినేడాది 'ఉగాది'కి కృష్ణ యింటిదగ్గరే లేడు. హోటల్లో పొద్దున్నే ఒక 'ఇడ్లీ సాంబారు' దుఃఖపడుతూ తింటున్నాడు. అప్పుడు రాజ్యలక్ష్మి వేపపూవుపచ్చడి స్వయంగా చేయలేదు. వాళ్ళక్కయ్యచేసి వాళ్ళ బావతోపాటు యిస్తే పుచ్చుకుంది.

"మళ్ళీ ఏడాదికి మీ ఆయనగారికి నువ్వు యిద్దువుగానిలే" అన్నాడు బావ - వాళ్ళ అక్కయ్య చేతిలో వుండగానే, ఉగాది పచ్చడి నాకేస్తూ.

"సిగ్గులేకపోతే సరి" అనుకున్నది లక్ష్మి. అక్కణ్నుంచి అవతలికిపోయింది!

కాని యివాళ సరిగ్గా ఆ సిగ్గులేనిఘనకార్యాన్నే కృష్ణ చేస్తే ఎంత ఆనందంతో పులకించిపోయిందని!

"పాం పసిపిల్లాడు కదూ?" అంది కొంటెగా.

"ఔను" అన్నాడు గర్వంగా.

"అయిందిలెండి అయ్యగారి రాజ్యం... యింకెన్నాళ్ళు" అతని జుట్టు రేపేసి అవతలికి పారిపోయింది సిగ్గుతో తొట్రుపడుతూ.

"ఏమిటీ?" సంభ్రమాశ్చర్యాలలో చతికిలబడిపోయి రెండు క్షణాలయ్యేక రాజ్యలక్ష్మి అన్న మాటలకు అర్థపరిశోధన మొదలెట్టేడు కృష్ణ.

"మీకు కజ్జికాయ లిష్టమా? పెరుగు గారెలిష్టమా?" చేత కవ్వం, పెరుగుగిన్నె పుచ్చుకుని వచ్చింది రాజ్యలక్ష్మి.

"నువ్వంటేనే యిష్టం."

"అయితే సరే!" వెళ్ళిపోబోయింది. లేచి దగ్గరిగా పొదవుకొని "నా ఆట కడుతుందన్నావే? పుట్టింటిమీదికి మనసు పోయిందా?" భయంగా అడిగాడు.

"కాదులెండి"... విడిపించుకుని, పెరుగ్గిన్నె అక్కడపెట్టి ముందుకుపడిన జడ వెనక్కి వేసుకుని గోడనున్న కేలండరువేపే చూపించి, తుర్రున పెరుగ్గిన్నె తీసుకుని పారిపోయింది.

కేలండర్‌లో యశోద 'కృష్ణుణ్ణి' ఎగరేసి అందుకొని మురిసిపోతోంది.

"హుర్రే!" మని అరిచాడు. చెంగున గెంతేడు కృష్ణ. "మై గుడ్నెస్! మై... మై..." అద్దంలో చూసుకుని మళ్ళీ 'ఏయ్ రాజా' అంటూ పెరట్లోకి పరిగెత్తాడు.

xxxxxx

"ఏమిటండీ రాజుగారు అల్లుతున్నారు? స్వెట్టరా?"

"మీ వూసు కాదులెండి" వాళ్ళో దాచేసుకుంది.

"సర్లే! మన శత్రువుక్కాబోలు" నన్నాడు కుర్చీలో కూలబడి.

గబగబా వెళ్ళింది రాజ్యలక్ష్మి. టిఫినూ, కాఫీ తెచ్చి అక్కడ పెట్టి, "యిదో, ఒక్క క్షణం... యీ నాలుగు గళ్ళూ..." అని మళ్ళీ అల్లుకోసాగింది.

కృష్ణ డీలాపడిపోయాడు. చేతులూ కాళ్లూ కడుక్కోమని చెప్పలేదే లక్ష్మి? కోపంగా టిఫిను తినేశాడు. అలాగే పాంట్ బెల్టు కూడా తీసుకోకుండా పడక కుర్చీలో కూలబడ్డాడు.

3

మర్నాడూ అంతే ... స్వెట్టరు అల్లుతోంది రాజ్యలక్ష్మి, తనకి కాదు కృష్ణకి అసలే కాదు. చిన్న బుల్లి స్వెట్టర్! దాన్ని గుండెల కదుముకుని కూనిరాగాలు తీస్తోంది.

అలా మూణ్ణెల్లు తిరిగాయి.

కృష్ణ గుండెల్లో రాయిపడింది.

"అమ్మ బాబోయ్, నువ్వెళ్ళకు రాజ్యం," అన్నాడు.

"సరే!" నంది ఏమనాలో తెలియని రాజ్యలక్ష్మి.

కాని, రాజ్యలక్ష్మి వాళ్ళమ్మ నాల్రోజుల్లో వచ్చింది. కృష్ణ తండ్రి కూడా వచ్చాడు. ఇంకా 'పెద్ద దిక్కులు' దిగబడ్డారు.

తప్పదన్నారు. ఐదో నెలనే పుట్టింటికి రాజ్యలక్ష్మిని ప్రయాణం కట్టించారు.

కృష్ణ రాజ్యలక్ష్మి గుండెల్లో తలదూర్చి ఏడిచాడు.

"ఛీ! మన 'బాబు' కోసమేగా... మళ్ళీ ఎన్నాళ్ళు... యిట్టే రానూ..." వోదార్చింది రాజ్యలక్ష్మి.

పద్దెనిమిదేళ్ళ రాజ్యలక్ష్మి అప్పుడే ఎంత పెద్దదై పోయింది!

"మరి, మీకు మా 'నాన్నగారు' కావాలా? మీ అమ్మగారా?" నవ్వుతూ సిగ్గుపడుతూ అడిగింది. ఆడపిల్లా, మగపిల్లాడా? అన్నది ఆ పిల్ల ఆరాటం.

"నాకు నువ్వే కావాలి."

"బాగుంది... అయ్యగారి కోరిక... నాకూ మీరే కావాలి" అన్నది వెళ్ళేముందు. రాజ్యలక్ష్మికి కృష్ణ అంటే చాలా ప్రేమ.

xxx xxx

టెలిగ్రాం వచ్చింది కృష్ణకి.

మాసిన గెడ్డం తడుముకుంటూ అకౌంట్స్ కూడుకుంటున్నవాడు, వులిక్కిపడి, టెలిగ్రాం అందుకుని,

"లక్ష్మి కులాసాయేనా?" అన్నాడు ఆత్రుతగా.

వేదాంతిలా నవ్వి, "ఏమో సార్! ఇది టెలిగ్రాం," అన్నాడు పోస్ట్‌మాన్ చెవినున్న పెన్సిలు సంతకాని కందిస్తూ. పరిగెత్తాడు కృష్ణ... తనకి కొడుకు! వాహోయ్!!....

"ఒరేయ్ రామం... ఏముండోయ్ రావూజీ... అరె.... శ్యామలగారా...?" అందరికీ చెప్పేశాడు.

టెన్సింగ్ నార్కేవా? తను! కాదు. యూరీ గగారినా! క్రికెట్ సెంచురియా? డబుల్ ప్రమోషనా? కాదు కాదు... రివ్వున వెళ్ళాడు.

రైలెక్కిపోయాడు.

వెధవరైలు... ఎక్స్‌ప్రెస్సుని తిడుతున్నాడు. "యింతకన్నా గూడ్సుబండీ, ఎడ్లబండీ నయం" అని.

రైల్లోనే అందరి మధ్యా పచార్లు చేయబుద్ధైంది.

"ఎలా వుంటాడో తన కొడుకు" అచ్చం దాని ముక్కులాగే వుంటే బావుంటుంది... అమ్మో లక్ష్మిముక్కా! అది ముక్కుకాదు," అనుకున్నాడు. మరో అలంకారం కోసం వెతుకుతున్నాడు. జేబులు తడుముకుని "లక్ష్మి ముక్కుకి సాటిలేదు" అన్నాడు. ఇంకా నయం ఎవరూ వినలేదు అని తనలోనే సిగ్గుపడి పేపరు చదవాలని తీశాడు. చదవడం రాలేదు...

రిక్షా ఎక్కాడుగానీ, నాలుగడుగులేగా పరిగెత్తిపోదునా? అనిపించింది.

"రా! రా! వెయ్యేళ్ళు ఆయుష్షు..."

అత్తగారు అడ్డంగా వచ్చింది. అడ్డంగా వచ్చిందని అనుకున్నాడు కృష్ణ. ఆవిడ అల్లుణ్ణి ఎదురొచ్చి పలకరించింది అంతే!

నీరసంగా గా వుంది రాజ్యలక్ష్మి మొహం. కాని ఆ కళ్ళల్లో ఎన్ని కాంతులున్నాయని!.... ఏమిటో ఆ నిబ్బరం... ప్రక్కనే ఎర్రని పసిగుడ్డు.

పిడికిళ్ళు మహా రహస్యాన్ని గుప్త పరుస్తున్నట్లు ముడుచుకుని,రెండుచేతులూ దమ్మిడీ అంత నోటిదగ్గర పెట్టుకుని 'చిరంజీవి' నిద్రపోతున్నాడు. ఆ పసిపాప కెక్కడ నొచ్చుకుంటుందో తన తాకిడి అన్నట్లు అతి సున్నితంగా పొదువుకుని బహుజాగర్తగా మడిచిన పొట్లంలాగ పడుకునుంది రాజ్యలక్ష్మి.

"అమ్మో! బాబు..." అన్నది లక్ష్మి, మోకాళ్ళమీద కూచుని తన దగ్గిరగా భర్త వొంగబోయేసరికి, 'బాబును చూశారా?' అన్నది తన భయానికి తనే సిగ్గుపడి.

"చూశాను... అంతా నువ్వే" అన్నాడు మళ్ళీ లక్ష్మిని తదేకంగా చూస్తూ....

"మా మాఁవగారి పోలికే. ఆ కళ్ళు చూడండి" అని పాపాయిని ఆప్యాయంగా గర్వంగా, నిండుగా చూసుకుంది రాజ్యలక్ష్మి.

"అబ్బ! ఎంత బాధ పెట్టేడనుకున్నారూ? వద్దూ బాబూ అనిపించాడు. పెంకినాన్న... చూడండి దొంగ; మళ్ళీ ఏమీ ఎరగనట్లు ఎలా నిద్దరోతున్నాడో?"- పసివాడి తల నిమిరింది.

"డాక్టరు వచ్చాడా ఇవాళ?"

"బావుంది... అమాయకత్వం..." ఎిటకేలకు కృష్ణ జుట్టు నిమిరింది లక్ష్మి. డాక్టరూ, మంత్రసానీ ఎవ్వరూ యిక అక్కర్లేదంది. భార్య స్పర్శతో కృష్ణ ప్రాణాలు లేచివచ్చాయి. ఎంతో ఆనందమయింది. ఆర్నెల్లు ఈ స్పర్శ కోసమే రాత్రింబగళ్ళు మరో ధ్యాస లేకుండా 'తపస్సే' చేశాడు. కలలే కన్నాడు.

"రాజూ" అన్నాడుకళ్ళనిండా నీళ్లు నింపుకుని.

"ఛ! బాబుని చూడండి..." అన్నది తృప్తిగా.

"చిక్కిపోయావు" అన్నాడు.

"తప్పు" అంది ముక్కున వేలేసుకుని - "నాకేం బాగానే వున్నాను" అంది.

4

మూణ్ణెల్లదాకా పుట్టింట వుండి - బాబుని తీసుకుని వచ్చేసింది రాజ్యలక్ష్మి - అప్పటికే "యింకా ఎప్పుడొస్తావు" అంటూ కృష్ణ నానా యాగీ చేసేశాడు - నెలకి రెండేసిసార్లు మెడికల్ లీవు పెట్టుకొని వచ్చి!

కాని వారం రోజులలో ఆ యిల్లు తనదేనా అన్నట్లుంది!!

గుమ్మంలో అగుపిస్తుందనుకున్న రాజ్యలక్ష్మి కనిపించకపోయేసరికి కృష్ణ మనసు చివుక్కుమంది. "బాబుని చూసుకోవద్దా మరి" అనుకుని సర్దుకున్నాడు. మెట్లెక్కి తలుపులు తోసుకుని లోపలికి వచ్చాడు. 'దభీ" మంది.

"ఇష్" వులిక్కిపడి వెంటనే వారించింది రాజ్యలక్ష్మి- "బాబుకి ఇప్పుడే చిన్న కునుకుపట్టింది' - అంటూ.

"సారీ!"

తాపీగా కూలబడ్డాడు. "మొదట్లో నువ్వు నాకు ఎక్కువ ముద్దుచేశావు. యిప్పుడు నన్ను మరిచిపోయావు" అందామా అనుకున్నాడు. కాని తన 'బాబు' నిద్రపాడవుతుందనేగా తలుపు చప్పుడు చెయ్యొద్దన్నది! అని సర్దుకో బోయాడు. కాని వుదయమూ అంతే! బూట్లు టకటక లాడించుతూ వెళ్ళకండి. బాబు వులిక్కిపడతాడంది. ప్రతిదానికీ 'బాబు' అంటూ తనను నిర్లక్ష్యం చేస్తున్నది!

ఉదయం ఆఫీసుకెళ్తూ బాబుని ముద్దెట్టుకుంటే "ఆ గుడ్డలు తొడుక్కున్నాకా ఎందుకేం ఆ ముద్దు" అని నిలదీసింది.

ఇప్పుడు కృష్ణని రాజ్యలక్ష్మి దండిచడం మానేసింది.సాధింపు మొదలెట్టింది. అలా అనుకున్నాడు కృష్ణ. "మీరు కాళ్లు కడుక్కోనిదే టిఫిన్ లేదు" అనదు యిప్పుడు - "అన్నీ అక్కడున్నాయి తీసుకోరూ... బాబు లేస్తున్నాడు చూసుకోవాలి" అంటూంది.

"రాజా" అని కేకేస్తే "మెల్లగా పిలవండి... దొంగ లేచాడంటే యింక వదల్డు" అంటుంది.

ఆఫీసునుంచి రాగానే, యిదివర్లో తనగురించే మాట్లాడే లక్ష్మి-యిప్పుడు బాబు ఆ వుదయం ఎన్నిసార్లు నవ్వేడో, కేకలు పెట్టాడో చెబుతుంది.

"మా బాబు! మా బంగారు తండ్రి ముద్ద బూర్లు చేస్తున్నాడు చూడండీ" అంటుంది.

"చూడండీ! యీ టోపీ అల్లాను వాడికీ", అని చూపెడుతుంది.

ఒకనాడు అరగంటముందే యింటి కొచ్చిన కృష్ణ, యింట పూసిన పువ్వొకటి కోసి స్వయంగా పెడదామని తెచ్చాడు రాజ్యానికి. "పెట్టనా" అన్నాడు.

"అక్కడుంచండి ఆనక పెట్టుకుంటాను... ఆఁ... అయినా వొద్దు లెద్దురూ... బాబుకి జలుబుచేస్తుందిట..." అన్నది ఒక్క అడుగు వెనక్కి వేసి.

కృష్ణకి చిర్రెత్తింది. అది చూసి జాలిపడ్డది రాజ్యం. "పోనీ పెట్టండి" అని వెనక్కి తిరిగింది. బాబును చూసుకుంటున్నదే తప్ప కృష్ణ స్వయంగా పువ్వు పెడుతున్నప్పుడైనా ఆ ధ్యాస లేదు. వెనుకటి ఆ సిగ్గుదొంతర్లే లేవు ఆ పిల్లలో!

ఆఫీసునించి వస్తూనే "రాజ్యం! నేను హోటల్‌లో పెరుగ్గారెలు తినేశా" నన్నాడు కృష్ణ.

"సరే, ఏంచేయను?... బాబు ఎందుకనో యివాళ నజ్జుగా వున్నాడు. నాకు మనసు మనస్సులో లేక టిఫిను చెయ్యనేలేక పోయా" నంది!

అదివరకు యిలాంటి సంఘటన - కృష్ణకి చెప్పగల ధైర్యమే వుండేదికాదు. చెప్పినా, రాజ్యం సతాయించి గుంజీళ్ళు తీయించినంత పనిచేసేది.

సినిమాలు అడగదు. పువ్వులు అడగదు. "ఎందుకండీ ఆ గుఱ్రంబుఱ్ర మార్కు టై కట్టుకున్నారు" అని అడగనేలేదు.

మూడ్రోజులు వరుసగా తెల్ల ప్యాంటూ, తెల్ల చొక్కా, గుఱ్రం తలకాయ మార్కు వున్న టై వేసుకుని ఆఫీసుకెళ్లాడు. వుహుఁ... రాజ్యలక్ష్మి అడగనేలేదు. "ఏమండీ! తెచ్చారా? పూసల గిలకలు" అనో లేదా "అయ్యో బాబుకి ఫలానా సబ్బు తెమ్మన్నాను గదా? తేలేదా?" అనో అడుగుతుంది.

"రాజ్యం... బాబుకి యిన్ని చొక్కా లెందుకు.....? వాడెలాగా రోజురోజుకీ ఎదుగుతాడుకదా... నీకు ఆ ఆకుపచ్చని సిల్కుగుడ్డ జాకెట్ కుట్టించుకోరాదూ?" అన్నాడు ఓసారి.

"వుహుఁ... బాబు ఎదుగుతాడు గనుక మన పొదుపుకి తక్కువ అయిందేం...? ఏకంగా వాడు బళ్ళోకి వెళ్ళినప్పుడు కుట్టించండి" - ఆ గుడ్డ మొహాన విసిరి, బాబునెత్తుకుని వెళ్ళి పోయిందక్కణ్ణుంచి.

రోజూ బాబుకి 'దోమల గూడు కావాలి, రబ్బరు బొమ్మలుకావాలి, ఫలాని పౌడర్ కావాలి, వాడు నజ్జుగా వున్నాడు... ఫలాన టానిక్‌కావాలి' అంటుంది రాజ్యలక్ష్మి ఉదయం తాను ఆఫీసుకెళ్తున్నప్పుడు.

అవి తేకుండా కృష్ణ యింటికి వస్తే అది అపరాధమే.

"ఈ వెధవ! నా ఖర్మకొద్దీ పుట్టాడనుకో" అన్నాడు ప్రాణం విసిగి - చివరి కొకసారి.

"ఛ! ఏం మాటలవి..." అని రాజ్యలక్ష్మి నిజంగా నొచ్చుకుంది... కనుకొలుకుల నీరు నింపుకుంది.

"అది సరేగాని రాజ్యం... నేను మేజోళ్లు కొనుక్కోవాలి... ఏ రంగు కొనుక్కోను?" ఆ మర్నాడు అడిగేడు.

"మీ యిష్టంగాని, బాబుకి మాత్రం జపాన్ కారు తీసుకురండి ఆ చేత్తోనే" అని పురమాయించింది. "మరే! మా బాబు కలెక్టరు అవుతాడుగా," అంది.

"బాగుంది యింకా పాకడమేనా రాదే వాడికి." ఏడుపుమొహం పెట్టేడు చిరాకు తెచ్చుకోడం అలవాటులేక.

"అందుకనే మరకారు... లేకపోతే నా బంగారు తండ్రికి నడబండీయే తేవాలి. నిజం 'కారే' కావాలి'-పాపాయి నెత్తుకుని ముద్దులాడింది.

"వీడికి జరిగిన ముద్దులో నీకు మీ అమ్మా... నాకు మా అమ్మా, వెయ్యో వంతేనా చేసేరంటావా?" అడిగాడు కృష్ణ కసిగా కొడుకును చూస్తూ.

"అమ్మో ఎత దుష్టులో మీరు! ఛీ! మనం వాడికి చేస్తున్న ముద్దేవిఁటి? నా బంగారుతండ్రికి మరొహైతేనా... ఎంతేనా చేద్దురు..." అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

తన బూట్లు వెతుక్కుని, మేజోళ్ళు వెతుక్కుని, బట్టలు తీసుకుని, అన్నీ అయ్యాక కాస్సేపు తిట్టుకుని ఆఫీసుకి తయారయ్యాడు కృష్ణ.

"జో అచ్యుతానంద! జో లాలి పరమానంద.....లాలీ"... బాబుని వుయ్యాల్లో వేసి పడుకోబెట్టుతోంది రాజ్యలక్ష్మి.

భర్త హడావుడి ఆ పిల్లకి పట్టనే లేదు. ఇదివరకు "ఎంత హాయి ఈ రేయి నిండెనో" పాట పాడి తనను నిద్రపుచ్చే లక్ష్మికి ఆ పాటలే రావు. మరచిపోయాననే తెగువ కూడా వచ్చేసింది. కృష్ణ అదే పదిసార్లు అనుకున్నాడు. విసుక్కున్నాడు. "వెళ్తున్నా" నన్నాడు కోపంగా.

"ప్లీజ్ తలుపుమెల్లిగా వేసుకోండేం" అన్నది అక్కణ్ణించే కంఠస్వరం నొక్కి పట్టి పలికి.

"వుహ్ఁ"... ఏమనుకోవాలో తెలియక కోపంగా ముక్కి వెళ్ళిపోయాడు ఆఫీసుకి కృష్ణ. తలుపు గట్టిగా కసిగా వేసుకున్నాడు.

"భడాలు" మందది.

'తనను పూర్తిగా మార్చిన జవరాలు 'రాజ్యం' యివాళ తానే యిలా మారిపోయింది. తనో పాత బొమ్మ అయిపోయాడు! కుర్రవెధవ కొత్తబొమ్మ అయిపోయాడు!! ఛీ! అంతే యీ జీవితమే ఓ బొమ్మలాట!' కృష్ణ బస్స్టాపులో బస్‌కోసం ఆగడం మరచిపోయి గబగబా కోపం తరుముతూండగా ఆఫీసుకుపోతున్నాడు!

(1979, యువప్రత్యేకసంచిక)